సాక్షి
వైఎస్‌ఆర్ జిల్లా
సోమవారం ; 14 ; అక్టోబర్ ; 2024



వైవీయూలో 'రాజీ'డ్రామాలు..?

యోగివేమన విశ్వవిద్యాలయం ప్రతిష్టను దెబ్బ తీసేలా కూటమి ప్రభుత్వం, అధికారులు వ్యవ హరిస్తుండటంతో విశ్వవిద్యాలయ ప్రాభవంపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. -8లో



అమ్మవారి ఊరేగింపులో అపశ్రుతి

విజయదశమి ఉత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి బెల్లంమండి వీధిలో అమ్మవారి ఊరేగింపులో అపశ్రుతి చోటుచేసుకుంది. ఎద్దుల బండికి విద్యుత్ తీగ తగులుకుంది. -8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
34.5/26.8

జిల్లాలో ఆదివారం 26.8 – 34.5 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.6 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

-కడప అగ్రికల్చర్



తొట్టి మెరవణిలో వాసవీ కన్యకాపరమేశ్వరి దివ్య రూపం



శమీదర్శనానికి తరలిన అమ్మవారు

మురిసిన పసిడిపురి

నింగిలోని తారలన్నీ నేలదిగినట్లు..
నలుదిక్కులా వెలుగు జిలుగులతో.....
జన సముద్రమే వాలిపోయిందన్నట్లు..
పోటెత్తిన జన కెరటాలతో..
పసిడిపురి హోరెత్తిపోయింది.
మహిషాసురుడిని దునుమాడి వధించిన దుర్గా దేవి దివ్య స్వరూపాన్ని చూసి..
భక్తజనం మురిసిపోయింది. విజయదశమిని పురస్కరించుకుని శనివారం సాయంత్రం శమీ దర్శనం.. అనంతరం రాత్రి తొట్టి మెరవణి కనులపండువగా సాగింది. 'శక్తి'గా మారిన విజయదుర్గ భక్తులను కరుణిస్తూ ఊరేగారు.

- కన్నులపండువగా వాసవాంబ తొట్టిమెరవణి
- భక్తులతో జనసంద్రమైన కొర్రపాడు రోడ్డు
- వైభవంగా శమీదర్శన మహోత్సవం

ప్రొద్దుటూరు కల్చరల్: దసరా ఉత్సవాలతో పసిడిపురి ప్రొద్దుటూరు మురిసిపోయింది. దేవీశరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా రోజూ ఓ అలంకరణలో అగుపించే అమ్మవారిని దర్శించడం ఒక ఎత్తైతే అన్ని ఆలయాల అమ్మవార్లను ఒకే చోట విజయదశమి నాడు శమీదర్శనంలో దర్శించడం మరింత ప్రత్యేకత. విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రొద్దుటూరులో శనివారం సాయంత్రం శమీదర్శన మహోత్సవం వైభవంగా సాగింది. వాసవీమాత ఉత్సవ మూర్తిని పూలతో, పుత్తడి ఆభరణాలతో అలంకరించి ఊరేగింపుగా తీసుకొచ్చి కొర్రపాడు రోడ్డులోని వాసవీ శమీవృక్ష మండపంలో శమీదర్శనం చేయించారు. కేరళ సింగారి మేళం, డీజే, బాణసంచా పేలుళ్లు, సినీ డూప్స్, పాల కొల్లు బ్యాండ్, విద్యుత్ ఆర్చీల వెలుగులు, మంగళవాయిద్యాల సందడి శమీదర్శనానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. డ్రోన్ ద్వారా పూలు చల్లడం శోభాయమానంగా నిలిచింది. భక్తులు అమ్మవారి పాదాల చెంత శమీ వృక్ష పత్రాలను వేసి సర్వశుభాలు అనుగ్రహించాలని వేడుకున్నారు. శమీదర్శన వేడుకలను తిలకించడానికి వచ్చిన భక్తులతో సర్కిళ్లు కిటకిటలాడాయి.



శక్తి వేషధారణ

వాసవీమాత తొట్టి మెరవని

శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో దేవీశరన్నవరాత్రి వేడుకల ముగింపు సందర్భంగా శనివారం అర్ధరాత్రి విజయలక్ష్మిదేవి అలంకారంలో అమ్మవారు గ్రామోత్సవం (తొట్టిమెరవణి) కన్నుల పండువగా నిర్వహించారు. అమ్మవారి ఉత్సవమూర్తిని గజమాలలతో, ఆభరణాలతో అలంకరించి శ్రీచక్రం ఉన్న పంచలోహ హంస వాహన రథంపై ఆశీనులను చేసి పురవీధులలో వాసవీ నామస్మరణ మధ్య అట్టహాసంగా ఊరేగించారు. ఈ వేడుకలో కేరళ సింగారిమేళం, శక్తి వేషాలు, హర్యానా వారి భంభం భోళే వేషాలు భక్తులకు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ రథం పురవీధుల్లో తిరగడం వల్ల అశుభాలు తొలగిపోయి మంచి జరుగుతుందన్ని భక్తుల విశ్వాసం. అమ్మవారిశాల నుంచి ప్రారంభమైన తొట్టిమెరవని బంగారు అంగళ్ల వీధి, పప్పుల బజార్ల మీదుగా పుట్టపర్తి సర్కిల్‌కు చేరుకుంది.రకరకాల బాణసంచా పేలుళ్లు, చెట్లు, రాకెట్లు, పాములు వంటి వాటిని పేల్చి విజయదశమి వేడుకలను అట్టహాసంగా నిర్వహించారు. అమ్మవారిని దర్శించేందుకు వచ్చిన భక్తులతో పురవీధులు కిటకిటలాడాయి. ఆర్య వైశ్యసభ అధ్యక్షుడు బుశెట్టి రాంమోహన్‌రావు, ఉపాధ్యక్షుడు రవీంద్ర బాబు, కార్యదర్శి మురికి నాగేశ్వరరావు, ఆర్యవైశ్య సభ ప్రముఖులు, సభ్యులు పాల్గొన్నారు.



ఆకట్టుకున్న బాణసంచా పేలుళ్లు



తొట్టి మెరవణి సందర్భంగా జనసంద్రమైన శివాలయం సర్కిల్

న్యూస్‌రీల్

ఉచితంగా డీఎస్సీ శిక్షణ

కడప రూరల్: జిల్లాలోని ఎస్సీ,ఎస్టీ అభ్యర్థులు ఎస్‌జీటీ, స్కూలు అసిస్టెంట్ పోస్టులకు సంబంధించి ఉచితంగా డీఎస్సీ శిక్షణ పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ కె.సరస్వతి తెలిపారు. అర్హత కలిగిన ఎస్సీ,ఎస్టీ అభ్యర్థులు ఈనెల 12 నుంచి 21వ తేదిలోపు జ్ఞాన భూమి వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు జ్ఞాన భూమి వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

20న జానమద్ది సాహిత్య సేవా పురస్కార ప్రదానం

కడప కల్చరల్ : సీపీ బ్రౌన్ స్మారక గ్రంథాలయ నిర్మాత డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి పేరిట ఈనెల 20న ఆదివారం ఉదయం 10 గంటలకు బ్రౌన్ గ్రంథాలయంలో గ్రంథాలయ, సాహిత్య సేవా పురస్కారాల ప్రదానోత్సవం నిర్వహించనున్నట్లు జానమద్ది సాహితీ పీఠం మేనేజింగ్ ట్రస్టీ జానమద్ది విజయభాస్కర్ తెలిపారు. ఇందులో భాగంగా పద్మశ్రీ డాక్టర్ కూరేళ్ల విఠలాచార్య, శతావధాని గండ్లూరి దత్తాత్రేయశర్మలకు ఈ పురస్కారాలు అందజేస్తారన్నారు. పూర్వ ఉప సభాపతి మండలి బుద్ద ప్రసాద్, న్యాయమూర్తి జస్టిస్ కృష్ణమోహన్, కలెక్టర్ శివశంకర్ లోతేటి, పైనేని తులసీనాథం నాయుడు హాజరవుతారన్నారు. సాయంత్రం 5.30 గంటలకు బ్రౌన్ గ్రంథాలయంలో తెలుగు భాషా వికాస ఉద్యమం ఆధ్వర్యంలో భువన విజయం సాహిత్య రూపాకాన్ని ప్రదర్శించనున్నట్లు తెలిపారు.

అగ్రిసెట్‌లో 19వ ర్యాంక్



శీర్ల నవ్య

ఖాజీపేట: నాగసానిపల్లె గ్రామానికి చెందిన శీర్ల నవ్య అగ్రి సెట్ ప్రవేశ పరీక్షల్లో 19వ ర్యాంకు సాధించి తన సత్తా చాటింది. ఖాజీపేట మండలం నాగసానిపల్లె గ్రామానికి చెందిన రాజుయాదవ్, శీర్ల శంకరమ్మల కుమార్తె నవ్య. అగ్రికల్చర్ శాస్త్రవేత్తగా ఉంటూ రైతులకు ఉత్తమ సేవలు అందించాలన్నదే తమ లక్ష్యం అని నవ్య స్పష్టం చేశారు.

పోస్టర్ల ఆవిష్కరణ


కడప రూరల్: మంచి కథాంశంతో నిర్మించిన పోట్టేల్ చిత్రంను విజయవంతం చేయాలని ఆ చిత్రం హీరో యువ చంద్రక్రిష్ణ అన్నారు. ఆదివారం స్థానిక ఓ హోటల్‌లో మూవీ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామీణ వాతావరణంలో ఒక అమ్మాయి చదువుకోసం చేసే పోరాట ఇతివృత్తంతో ఈ చిత్రంను నిర్మించినట్లు పేర్కొన్నారు. ఈ చిత్రం కథా రచయిత, దర్శకులు సాహిత్ మోతుకూరి సినిమాను అద్భుతంగా తెరకెక్కించారని తెలిపారు. హీరోయిన్‌గా అనన్య నటించగా, సంగీత శేఖర్ చందు అందించారని వివరించారు.

అరుణాచలానికి ప్రత్యేక సర్వీసులు

కడప కోటిరెడ్డిసర్కిల్: పౌర్ణమిని పురస్కరించుకుని ప్రముఖ పుణ్యక్షేత్రమైన అరుణాచలానికి ఈనెల 16వ తేదిన ప్రత్యేక బస్సు సర్వీసులను నడపనున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి పోలిమేర గోపాల్ రెడ్డి తెలిపారు. కడప నుంచి రాత్రి 8 గంటలకు సూపర్ లగ్జరీ (6001) సర్వీసులో రూ. 1072 చార్జీగా ఉందన్నారు. బద్వేల్ డిపో నుంచి రెండు బస్సులు (9569, 60009) ఉదయం 7 గంటలకు పెంచలకోన మీదుగా నడిచే సూపర్ లగ్జరీ బస్సుల్లో రూ. 1668, పులివెందుల డిపో నుంచి ఉదయం 7 గంటలకు అల్ట్రా డీలక్స్ (59100) బస్సులో రూ.1193, మైదుకూరు డిపో నుంచి ఉదయం 6 గంటలకు పోరుమామిళ్ల నుంచి (97876) వెళ్లే బస్సులో రూ. 1414, సాయంత్రం 6 గంటలకు మైదుకూరు నుంచి (95678) వెళ్లే బస్సులో రూ. 1209గా చార్జీలు ఉన్నాయని వివరించారు. ప్రొద్దుటూరు డిపో నుంచి సాయంత్రం 6 గంటలకు (9944) వెళ్లే సూపర్ లగ్జరీ బస్సులో రూ. 1273, జమ్మలమడుగు డిపో నుంచి మధ్యాహ్నం ఒంటిగంటకు (98398) వెళ్లే సూపర్ లగ్జరీ బస్సులో రూ. 1352లు టిక్కెట్‌గా నిర్ణయించామన్నారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

లక్కీబాబులు ఎవరో!

- మద్యం షాపుల నిర్వహణ కోసం నేడు లాటరీ ప్రక్రియ
- వైఎస్సార్ జిల్లాలో 3,257, అన్నమయ్య జిల్లాలో 2,160 దరఖాస్తులు
- దరఖాస్తులు రుసుం రూపేనా ప్రభుత్వానికి రూ.108.34 కోట్ల ఆదాయం



సాక్షి ప్రతినిధి, కడప: మద్యం వ్యాపారుల అదృష్ట పరీక్షకు సర్వం సిద్ధమైంది. సోమవారం ఉదయం 8 గంటల నుంచి కలెక్టర్ సమక్షంలో మద్యం షాపుల నిర్వహణ లైసెన్సు కోసం లాటరీ ప్రక్రియ కొనసాగనుంది. వైఎస్సార్ జిల్లాలో 139 మద్యం షాపుల కోసం 3,257 మంది దరఖాస్తులు చేసుకున్నారు. అన్నమయ్య జిల్లాలో 111 షాపుల కోసం 2,160 దరఖాస్తులు లభించాయి. ఒక్కో దరఖాస్తు రూ.2లక్షల చొప్పున రెండు జిల్లాల్లో కలిపి రాష్ట్ర ప్రభుత్వానికి దరఖాస్తుల రూపంలో రూ.108.34కోట్లు ఆదాయం లభించింది. కాగా మద్యం వ్యాపారుల మధ్య అత్యధిక పోటీ వీరబల్లె (57దరఖాస్తులు), కాశినాయన (53 దరఖాస్తులు) మండలాల్లో నెలకొంది.

- వైఎస్సార్ జిల్లాకు సంబంధించి కడప జడ్పీ మీటింగ్ హాల్‌లో సోమవారం ఉదయం 8 గంటల నుంచి లాటరీ ప్రక్రియ నిర్వహించనున్నారు. రాయచోటిలో పీలేరు రోడ్డులోని లయ గార్డెన్స్‌లో అన్నమయ్య జిల్లా మద్యం షాపుల నిర్వహణకు లాటరీ ప్రక్రియ జరగనుంది. ఆయా కలెక్టర్ల నేతృత్వంలో జరిగే ఈప్రక్రియను పూర్తిగా వీడియో రికార్డింగ్ చేయనున్నారు. లాటరీ ద్వారా ఎంపికైన వారికి మద్యం షాపుల లైసెన్సు కేటాయిస్తూ ఉత్తర్వులు ఇవ్వనున్నారు. తొలుత బెదిరింపులు, సిండికేట్ వ్యవహారం తెరపైకి వచ్చినా, తుదకు పోటాపోటీగా టెండర్ ప్రక్రియలో మద్యం వ్యాపారులు పాల్గొన్నారు. పీలేరు, కమలాపురం, జమ్మలమడుగు, రాజంపేట నియోజకవర్గాల్లో కొన్ని మద్యం షాపులకు మాత్రమే సింగిల్ డిజిట్ నెంబర్ దరఖాస్తులు పడ్డాయి. మిగతా అన్ని ప్రాంతాల్లో భారీ స్థాయిలో వ్యాపారులు లైసెన్సు కోసం దరఖాస్తులు చేసుకున్నారు.

అత్యధిక పోటీ కాశినాయనలో...

వైఎస్సార్ జిల్లాలో 139 మద్యంషాపుల కోసం 3,257 మంది దరఖాస్తులు చేసుకున్నారు. అందులో అత్యధికంగా 124వ షాపు(కాశినాయన మండలం) 53 దరఖాస్తులు లభించాయి. తర్వాత స్థానంలో 81వ షాపు (ప్రొద్దుటూరు రూరల్) 49, 136వ షాపు(పోరుమామిళ్ల) 44, 82వ షాపు (ప్రొద్దుటూరు రూరల్) 42 దరఖాస్తులు లభించాయి. కడపలో 9వషాపునకు అత్యధికంగా 35 దరఖాస్తులు వచ్చాయి. మొత్తం 139 మద్యం షాపులల్లో సింగిల్ డిజిట్ దరఖాస్తులు కేవలం 20షాపులకు మాత్రమే పడ్డాయి. అందులో కమలాపురం నియోజకవర్గంలో 9షాపులకు, సిద్దవటంలో 5షాపులు, జమ్మలమడుగులో 6 షాపులకు సింగిల్ డిజిట్ దరఖాస్తులున్నాయి.

వీరబల్లి మద్యం షాపు కోసం తీవ్ర పోటీ

అన్నమయ్య జిల్లాలో 10వ మద్యం షాపు (వీరబల్లి) నిర్వహణ కోసం అత్యధిక పోటీ నెలకొంది. 57 మంది మద్యం వ్యాపారులు వీరబల్లి షాపు కోసం పోటీ పడ్డారు. తర్వాత స్థానంలో బి.కొత్తకోట నిలుస్తోంది. అక్కడి 77వ షాపు కోసం 45మంది పోటీ పడ్డారు. అన్నమయ్య జిల్లాలో 111 మద్యం షాపుల కోసం 2,160 మంది దరఖాస్తులు చేసుకోగా, 7మద్యం షాపులకు మాత్రమే సింగిల్ డిజిట్ దరఖాస్తులు దాఖలయ్యాయి. అందులో 5షాపులు పీలేరు నియోజకవర్గం పరిధిలోనివే. ఓబులవారిపల్లె, నందలూరు షాపులకు కూడా సింగిల్ డిజిట్ దరఖాస్తులు నమోదు అయ్యాయి. పచ్చ నేతలు పెద్ద ఎత్తున ఒత్తిడి తీసుకరావడంతోనే పలుచోట్ల మద్యం వ్యాపారులు వెనక్కి తగ్గినట్లు సమాచారం.

నేడు మద్యం దుకాణాలకు లక్కీ డ్రా

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన మద్యం పాలసీల్లో భాగంగా జిల్లాకు కేటాయించిన 139 ప్రైవేట్ మద్యం దుకాణాలకు సోమవారం లక్కీ డ్రా నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండ్ రవి కుమార్ పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో 139 ప్రైవేట్ మద్యం దుకాణాలకు 3257 దరఖాస్తులు వచ్చాయన్నారు. మద్యం దుకాణాల కేటాయింపునకు జిల్లా పరిషత్ సమావేశపు హాల్లో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో లక్కీ డ్రా తీస్తామన్నారు. మద్యం దుకాణాలను దక్కించుకున్న వారు పాట పాడిన మొత్తంలో 1/6 శాతం చెల్లిస్తే ప్రొహిబిషన్ లైసెన్స్‌ను అందిస్తామన్నారు. మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకున్న వారు తమ ఎంట్రీ పాసులతో ఉదయం 7 గంటల కల్లా జెడ్పీ కార్యాలయానికి రావాలన్నారు. దరఖాస్తుదారులు తప్ప మిగతా ఎవరికీ జెడ్పీ కార్యాలయ సమీపంలోకి అనుమతులు లేవని స్పష్టం చేశారు.



మాట్లాడుతున్న జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండ్ రవి కుమార్

కళాశాలల్లో ప్రాక్టికిల్స్

- ఇంటర్ కళాశాలల్లో అటకెక్కిన పరికరాలు, రసాయనాలు
- బూజు పట్టిన ల్యాబ్ గదులు.. ప్రాక్టికల్ నిర్వహణ నిల్
- కొన్ని ప్రైవేటు కళాశాలల్లో కాగితాలకే పరిమితమైన ల్యాబ్‌లు
- చోద్యం చూస్తున్న ఇంటర్ బోర్డు అధికారులు



ఫిజిక్స్ ప్రాక్టికల్స్ చేస్తున్న విద్యార్థులు(ఫైల్)

కడప ఎడ్యుకేషన్ : పాఠ్యపుస్తకాల్లోని పాఠ్యాంశాలు విద్యార్థులకు వందశాతం అర్థం చేసుకోవాలంటే ప్రయోగాలు తప్పనిసరి. అందుకు అనుగుణంగా విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే వాటిని విద్యార్థుల చేత చేయించాలి. అయితే ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలలు ప్రయోగాలను అటకెక్కిస్తు న్నాయి. ప్రాక్టికల్స్‌ను కిల్ చేస్తూ ఆ పీరియడ్లను థియరీకి వినియోగిస్తున్నాయి. ప్రాక్టికల్స్‌కు సంబంధించి ద్వితీయ సంవత్సరం చివరిలో అది కూడా ప్రాక్టికల్ పరీక్షలు మరో 20 రోజులుండగా వాటికి బూజులు దులిపి విద్యార్థుల చేత అరకొరగా ప్రాక్టి కల్స్‌ను నిర్వహిస్తారు. తనిఖీలు చేయాల్సిన అధికారులు చోద్యం చేస్తున్నారు. ఫలితంగా విద్యార్థుల్లో ప్రాక్టికల్ ప్రమాణాలు పడిపోతున్నాయి.

అన్ని యాజమాన్య కళాశాలల్లో ...

జిల్లా వ్యాప్తంగా అన్ని యాజమాన్య జూనియర్ కళాశాలల్లో ఫస్ట్ ఇయర్ అకడమిక్ ప్రారంభం నుంచే థియరీకి సమాంతరంగా ప్రాక్టికల్స్ తరగతులను కూడా నిర్వహించాల్సి ఉంటుంది. కానీ ఈ ప్రకారం ఎక్కడ కూడా జరగడం లేదు. ప్రాక్టికల్స్‌ను నిర్వహిస్తే థియరీ బోధనకు సమయం సరిపోదని అంతగా ప్రాక్టికల్స్ గురించి పట్టించుకోరు. ద్వితీయ సంవత్సరం నుంచి ప్రభుత్వ యాజమాన్య కళాశాలల్లో మాత్రం విద్యార్థులకు పీరియడ్లను కేటాయించి ప్రాక్టికల్స్ తరగతులను నిర్వహిస్తూ విద్యార్థులతో ప్రయోగాలను చేయిస్తారు.

ప్రైవేటు, కార్పొరేట్‌లలో నిల్..

జిల్లా వ్యాప్తగా అత్యధిక ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలల్లో ప్రాక్టికల్ క్లాసుల నిర్వహణ అనేది పూర్తిగా జరగడం లేదనేది జగమెరిగిన సత్యం. ప్రాక్టికల్స్ పరీక్షలకు సంబంధించి కెమిస్ట్రి, ఫిజికల్ సైన్సు, బాటనీ, జువాలజీ సబ్జెక్టులకు సంబంధించి ఒక్కో దానికి 30 మార్కులు ఉండటంతో వాటికి అధిక ప్రాధాన్యత ఉంటుంది. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో మార్కుల స్కోర్ పెరగడానికి ప్రాక్టికల్స్ మార్కులు బాగా దోహదపడతాయి. ఇందుకోసమే ప్రాక్టికల్ పరీక్షల విధులకు వచ్చే సిబ్బందిని ప్రసన్నం చేసుకుని చదువులో బాగా రాణించే విద్యార్థులకు మంచి మార్కులు వేయించుకుని స్కోర్‌ను పెంచుకుంటారు.

నిబంధనలకు పాతర ..

జిల్లా వ్యాప్తంగా ప్రైవేటు, కార్పొరేట్ జూనియర్ కళాశాలలు ఇంటర్ బోర్డు నిబంధనలకు పాతరేసి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. అడ్డదారుల్లో మార్కులు, ర్యాంకులు తెచ్చుకునే వెసులుబాటుకు అలవాటు పడిన యాజమాన్యాలు ప్రాక్టికల్స్ పీరియడ్స్‌ను పక్కన పెట్టేశాయనే ఆరోపణలు ఉన్నాయి. ప్రాక్టికల్స్ పరీక్షల సమయంలో ఒక్కో విద్యార్థి వద్ద నుంచి రూ. 500 నుంచి రూ. వెయ్యి వరకు వసూలు చేసి ఈ సొమ్మును ప్రాక్టికల్స్ పరీక్షల నిర్వహణకు వచ్చే సిబ్బందికి ముడుపులుగా ఇస్తారనే ఆరోపణలు ఎప్పటి నుంచో ఉన్నాయి.

జంబ్లింగ్ ఎత్తేసినప్పటి నుంచి...

గతంలో కొన్ని రోజులు ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణను జంబ్లింగ్ విధానంలో చేపట్టేవారు. అంటే ఒక కళాశాలకు చెందిన విద్యార్థులు మరో కళాశాలకు వెళ్లి ప్రాక్టికల్ చేయాల్సి వచ్చేది. దీంతో కళాశాలల యాజమాన్యాలు కొంత భయపడి విద్యార్థుల చేత ప్రాక్టికల్స్ చేయించేవారు. ఆ తరువాత మళ్లీ జంబ్లింగ్ విధానాన్ని ఎత్తేస్తూ ఇంటర్‌బోర్డు ఆదేశాలు జారీ చేసింది. దీంతో మళ్లీ ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలల యాజమాన్యాలు ఆడిందే ఆట పాడిందే పాటగా సాగుతోంది.

జిల్లాలో ఇంటర్మీడియట్ కళాశాలలు, ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థుల వివరాలు ఇలా..

యాజమాన్యం	కళాశాలల సంఖ్య	బాలురు	బాలికలు	మొత్తం
గవర్నమెంట్	20	1871	3040	4911
హైస్కూల్ ప్లస్	07	0	328	328
కేజీబీవీలు	17	0	934	934
మోడల్ స్కూళ్లు	03	54	307	361
ప్రైవేటు ఎయిడెడ్	05	491	200	691
ప్రైవేటు అన్‌ఎయిడెడ్	72	12044	11468	23512
సోషల్ వెల్ఫేర్	11	294	881	1175
ఒకేషనల్	09	408	455	863
మొత్తం	144	15163	17613	32775

తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకుంటాం



ప్రైవేటు, కార్పొరేట్ జూనియర్ కళాశాలల్లో అకడమిక్ క్యాలెండర్ ప్రకారం తప్పని సరిగా ప్రాక్టికల్స్ తరగతులు నిర్వహించాలి. జిల్లాలోని అన్ని యాజమాన్య కళాశాలల్లో ప్రాక్టికల్స్ తరగతుల నిర్వహణపై తనిఖీలు చేస్తాం. ప్రాక్టికల్స్ నిర్వహించని ఆయా కళాశాలల యాజమాన్యంపై చర్యలు తీసుకుంటాం.

– బండి వెంకటసుబ్బయ్య, ఆర్ఐఓ, ఇంటర్ విద్య.

క్లుప్తంగా

కడప రాయుని కోవెలలో కల్యాణ రాగం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

కడప కల్చరల్ : తిరుమలకు తొలి గడపగా భావించే కడప నగరంలోని దేవుని కడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆలయ ఇన్స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా దేవతా మూర్తుల ఉత్సవ విగ్రహాలకు విశేష అభిషేకాలు నిర్వహించి వధూవరులుగా అలంకరించి కల్యాణ వేదికపైగల ప్రత్యేక పీఠాలపై కొలువుదీర్చారు. అనంతరం అర్చకులు కృష్ణమోహన్, త్రివిక్రమ్‌ల ఆధ్వర్యంలో కల్యాణ క్రతువును క్రమంగా నిర్వహించారు. అమ్మవారి మంగళసూత్రాలను భక్తులకు దర్శింపజేసి వారే స్వామి పక్షాన శ్రీదేవి, భూదేవి మాతల గళసీమల్లో అలంకరించారు. కల్యాణం అనంతరం లాజహోమం నిర్వహించారు. ఉభయదారులతో ప్రత్యేక పూజలు నిర్వహింపజేశారు. సాయంత్రం కల్యాణమూర్తులను ప్రత్యేక పల్లకీపై కొలువుదీర్చి మాడవీధుల్లో ఊరేగించారు. సాక్షాత్తూ వైకుంఠ వాసుడే అమ్మవార్లతో కలిసి తమ ఇంటి ముంగిటికి రావడంతో భక్తులు పులకించి పూజాద్రవ్యాలు సమర్పించి పూజలు జరిపారు. అర్చకులు మంగళ హారతులు, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

యువతిని కాపాడిన రైల్వే పోలీసులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరం చెమ్ముమియాపేటకు చెందిన ఓ యువతి కడప రైల్వేస్టేషన్‌లో ఆత్మహత్య చేసుకునేందుకు యత్నించగా రైల్వే పోలీసులు కాపాడారు. బాధితురాలు ఇంటిలో గొడవపడి రైల్వేస్టేషన్‌కు చేరుకుని ప్లాట్‌ఫాంపై దిగులుగా కూర్చొని ఉండగా ఆర్పీఎఫ్ హెచ్‌సీ ప్రభాకర్‌రెడ్డి, మహిళా కానిస్టేబుల్ సునీత బాధితురాలితో మాట్లాడారు. ఆమె పరిస్థితి తెలుసుకుని ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుందన్నారు. ఆత్మహత్య ఆలోచన విరమించుకోవాలని సూచించారు. అనంతరం కౌన్సెలింగ్ ఇచ్చి ఆమె మేన మామకు అప్పగించారు.

సాయిబాబా మరణానికి కేంద్ర ప్రభుత్వానిదే బాధ్యత

కడప వైఎస్ఆర్ సర్కిల్ : దివ్యాంగుడై, గుండె జబ్బుతో నిత్యం బాధపడుతున్న ప్రొఫెసర్ సాయిబాబా మరణానికి కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని ఆర్‌సీపీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సాయిబాబా పై ఎలాంటి ఆధారాలు లేకుండా పదేళ్ల పాటు నాగపూర్ జైల్లో పెట్టి ఎంతో క్రూరంగా నిర్బంధించారని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పటికే అనారోగ్యంతో బాధపడుతున్న ఆయనకు ఎలాంటి వైద్య సౌకర్యాలు కల్పించకుండా మానసిక ఒత్తిడికి గురి చేశారన్నారు. తన తల్లి చనిపోతే కడసారి చూపునకు కూడా నోచుకోనీయకుండా, ఆయన వేదనతో బాధపడుతూ ఉంటే ఆర్ఎస్ఎస్ కనుసన్నల్లోని బీజేపీ ప్రభుత్వం రాక్షస ఆనందం అనుభవించిందన్నారు. బీజేపీ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని చెప్పారు.

అమ్మవారి ఊరేగింపులో అపశ్రుతి

- విద్యుత్ షాక్‌తో వ్యక్తితో పాటు ఎద్దు మృతి
- నలుగురికి తీవ్రగాయాలు

కడప అర్బన్ : విజయదశమి ఉత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి బెల్లంమండి వీధిలో అమ్మవారి ఊరేగింపులో అపశ్రుతి చోటుచేసుకుంది. అమ్మవారి ఊరేగింపు జరుగుతున్న సమయంలో ఎద్దుల బండికి విద్యుత్ తీగ తగులుకుంది. దీంతో విద్యుత్ షాక్‌కు గురై ఎద్దుతో పాటు మరొక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందారు. మరో నలుగురు గాయపడ్డారు. చికిత్స నిమిత్తం వారిని రిమ్స్‌కు తరలించారు. గాయపడిన వారిలో రెండున్నర సంవత్సరాల బాలుడు ఉన్నాడు. సంఘటన స్థలాన్ని కడప టూటౌన్ సీఐ బి. నాగార్జున, ఎస్ఐ ఎస్‌కేఎం హుసేన్ పరిశీలించారు. వైద్య పరీక్షల నిమిత్తం గాయపడిన వారిని రిమ్స్‌కు తరలించారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు ... పెండ్లిమర్రి మండలం మిట్టమీదపల్లి గంగనపల్లెకు చెందిన మేకల రామయ్య (48) కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల ఆయన మాలధారణ చేశారు. దసరా ఉత్సవాల్లో భాగంగా ఆయన గడ్డిబజార్‌లోని బాలాజీ దేవాలయంలో ఉన్న అమ్మవారి ఊరేగింపులో, లైటింగ్ పనులు చేస్తుండేవాడు. అందులో భాగంగా అమ్మవారి ఊరేగింపు వెంట వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగి మృత్యువాత పడ్డాడు. ఇతనితో పాటు పుష్పగిరికి చెందిన వెంకటరమణ, శ్రీనివాసులు, కడప బెల్లంమండి వీధికి చెందిన రంగరాజీకుమార్‌లతో పాటు, మరో బాలునికి గాయాలయ్యాయి. ముగ్గురు రిమ్స్‌లో చికిత్స పొందుతుండగా బాలుడు మాత్రం ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. రామయ్య మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు.



మేకల రామయ్య మృతదేహం



గాయపడిన బాలుడు

మృతుని, క్షతగాత్రుల కుటుంబాలను ఆదుకోవాలి: ఎస్.బి అంజద్‌బాషా, మాజీ ఉప ముఖ్యమంత్రి

దసరా ఉత్సవాల్లో విద్యుత్ షాక్ సంఘటనలో ఒకరు మృతి చెందడం, నలుగురు తీవ్రంగా గాయపడటంతో విషయం తెలుసుకున్న మాజీ ఉప ముఖ్యమంత్రి ఎస్.బి అంజాద్ బాషాతో పాటు పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదివారం రిమ్స్‌కు చేరుకున్నారు. మార్చురీ వద్ద ఆలయ కమిటీ వారిని, రిమ్స్‌లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను సంఘటన గురించి అడిగి తెలుసుకున్నారు. మృతుని కుటుంబాన్ని, క్షతగాత్రుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.



మృతుని కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఉప ముఖ్యమంత్రి ఎస్.బి అంజద్ బాషా

ఘనంగా ఆయుధ పూజ

పోలీసు ఆయుధాగారంలో జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు దంపతుల ప్రత్యేక పూజలు



వాహనాలకు పూజ నిర్వహిస్తున్న జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు

కడప అర్బన్ : కడపలోని జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో విజయదశమి సందర్భంగా శనివారం ఘనంగా ఆయుధపూజ జరిగింది. పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో జిల్లా ప్రజలు, పోలీసులు సుఖశాంతులతో ఉండాలని ఆకాంక్షిస్తూ జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు, సతీమణితో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ఆనవాయితీ ప్రకారం పోలీసు ఆయుధాగారంలోని అన్ని రకాల ఆయుధాలకు, వాహనాలకు పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ దుర్గామాత ఆశీస్సులతో జిల్లా ప్రజలు, రాష్ట్ర పోలీసులు సంతోషంగా జీవించాలని, జిల్లా పోలీసులకు తమ దైనందిన విధులు, సేవల్లో విజయాలు చేకూరాలన్నారు. ప్రజలతో మమేకమై పోలీసుశాఖ ప్రతిష్ట పెంపొందేలా పోలీసు విధులు ఉండాలని ఎస్పీ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ (పరిపాలన) కె. ప్రకాష్‌బాబు, ఏ.ఆర్. డీఎస్పీ మురళీధర్, డీపీఓ ఏఓ జ్యోతి, ఆర్ఐలు వీరేష్, టైటస్, చిన్నచౌక్ సీఐ ఎస్. తేజమూర్తి, ఎస్ఐ పి. రవికుమార్, పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పుశంకర్, ఆర్ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వేర్వేరు ఘటనల్లో ఇరువురికి కత్తిపోట్లు

- సిగరేట్ కాల్చవద్దన్నందుకు ఒకరిపై..
- మీద పడ్డాడని తోసినందుకు మరొకరిపై కత్తితో దాడి

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరులోని పలు ప్రాంతాల్లో జరిగిన వేర్వేరు ఘటనల్లో ఇరువురు కత్తిపోట్లకు గురయ్యారు. తన దగ్గర సిగరేట్ కాల్చవద్దని చెప్పినందుకు ఒకరిని, మీద పడ్డాడని తోసి నందుకు మరొక వ్యక్తిని కత్తితో పొడిచి గాయపరిచారు. టూ టౌన్ పోలీసులు తెలిపిన మేరకు.. ఏకే రోడ్డుకు చెందిన చింతల సుధీర్ ప్రైవేట్ కంపెనీలో పని చేస్తున్నాడు. దసరా ఉత్సవాలను తిలకించేందుకు అతను స్నేహితులతో కలిసి శనివారం రాత్రి పట్టణంలోకి వెళ్లాడు. ఈ క్రమంలో ఆదివారం వేకువ జామున రాజీవ్ సర్కిల్ వద్ద ఉండగా ఒక యువకుడు సుధీర్‌పై పడ్డాడు. ఎందుకు తనపై పడతావంటూ సుధీర్ అతన్ని పక్కకు తోశాడు.

దీంతో అక్కడి నుంచి వెళ్లిన గుర్తు తెలియని ఆ యువకుడు మరో నలుగురితో కలిసి వచ్చి సుధీర్‌ను కత్తితో పొడిచి పారిపోయారు. తీవ్రంగా గాయపడిన సుధీర్‌ను స్నేహితులు చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సుధీర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూ టౌన్ సీఐ యుగంధర్ తెలిపారు. సీసీ కెమెరాల ఆధారంగా నిందితులను గుర్తించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చింతల సుధీర్



దాడిలో గాయపడిన కాలేషావలి

తన దగ్గర సిగరేట్ తాగొద్దన్నందుకు కత్తితో దాడి

పట్టణంలోని శ్రీనివాసనగర్‌కు చెందిన కాలేషావలి పెయింటర్ పని చేసుకొని జీవనం సాగిస్తున్నాడు. అతను శనివారం రాత్రి మైదుకూరు రోడ్డులోని వాస్తు కాంప్లెక్స్ వద్ద కూర్చొని ఉండగా పక్కనే ఖాసీంపీరా అనే వ్యక్తి సిగరేట్ కాలుస్తూ నిల్చున్నాడు. తనకు సిగరేట్ పొగ పడదని, ఇక్కడ ఎందుకు సిగరేట్ తాగున్నావంటూ కాలేషావలి చెప్పాడు. దూరంగా వెళ్లమని చెప్పడంతో ఇరువురి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఖాసీంపీరా దగ్గరలో ఉన్న తన ఇంటికి వెళ్లి కొందరు వ్యక్తులను తీసుకొని వచ్చాడు. ఈ క్రమంలో వారి మధ్య గొడవ జరుగగా ఖాసీంపీరా, కొందరు వ్యక్తులు కలిసి కత్తితో కాలేషావలిని పొడిచారు. తీవ్రంగా గాయపడిన అతన్ని చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. కాలేషావలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు టూ టౌన్ సీఐ యుగంధర్ తెలిపారు.

మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ వైఎస్ ప్రమీలమ్మకు మాతృ వియోగం

నివాళులు అర్పించిన వైఎస్ భారతి, కడప ఎంపీ, వైఎస్ కుటుంబ సభ్యులు

పులివెందుల రూరల్/టౌన్ : పులివెందుల మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ వైఎస్ ప్రమీలమ్మ తల్లి చవ్వా వేదామణి (86) ఆదివారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సతీమణి వైఎస్ భారతి, ఆమె తల్లి సుగుణమ్మ పులివెందులలోని అంబకపల్లె రోడ్డులో ఉన్న నివాసానికి వెళ్లి వేదామణి భౌతిక కాయం వద్ద పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అలాగే కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి కూడా నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్ రెడ్డి, వైఎస్ సోదరులు, వైఎస్ ప్రకాష్‌రెడ్డి, వైఎస్ ప్రతాప్‌రెడ్డి, వైఎస్ ఆనందరెడ్డి, వైఎస్ జోసఫ్‌రెడ్డి వైఎస్ మధురెడ్డితో పాటు, ఆమె కుమారుడు విజయశేఖర్‌రెడ్డి, కుమార్తెలు, కోడళ్లు, అల్లుళ్లు, మనవళ్లు,దుశ్యంత్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, జగదీశ్వరరెడ్డి, మనవరాళ్లు,మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ చిన్నప్ప, కడప డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డితో పాటు వైఎస్ కుటుంబ సభ్యులు బంధువులు, సన్నిహితులు నివాళులు అర్పించారు. లయోలా డిగ్రీ కళాశాల రోడ్డులో ఉన్న వైఎస్ సమాధుల వద్ద అంతిమ సంస్కారాలు నిర్వహించారు.



నివాళులు అర్పిస్తున్న వైఎస్ కుటుంబ సభ్యులు (ఇన్‌సెట్) వేదామణి (ఫైల్)

నేత్రదానం

చవ్వా వేదామణి కుటుంబ సభ్యులు నేత్ర దానానికి అంగీకరిస్తూ జిల్లా అంధత్వ నివారణ సంస్థ, స్నేహిత అమృత హస్తం సేవాసమితి నేత్ర సేకరణ కేంద్రం అధ్యక్షుడు రాజుకు సమాచారం అందజేశారు. దీంతో వారు టెక్నీషియన్ హరీష్‌తో కలిసి అక్కడికి చేరుకుని ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ ఈసీ సుగుణమ్మ సమక్షంలో భౌతికకాయం నుంచి కార్నియాలను సేకరించి హైదరాబాద్‌లోని డాక్టర్ అగర్వాల్ నేత్రనిధికి పంపారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి



మృతురాలు గీత

ములకలచెరువు : మండలానికి చెందిన ఒక వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. మండలంలోని వేపూరికోట పంచాయతీ కుటాగోళ్లపల్లెకు చెందిన ప్రకాష్‌కు పెద్దమండ్యం మండలం పాపేపల్లెకు చెందిన పప్పు శెట్టి నరసింహులు, కుమారి దంపతుల కుమార్తె పి. గీతాకు మూడేళ్ల క్రితం వివాహమైంది. వివాహం అనంతరం దంపతులు చెన్నైలో కాపురం ఉంటున్నారు. వీరికి 11 నెలల కుమారుడు సంతానం. ప్రకాష్ ఒక ట్రాన్స్‌పోర్టు కంపెనీలో పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఆమె కుటుంబ కలహాలతో శనివారం చెన్నైలోని ఇంటిలో ఉరేసుకొని మృతిచెందింది. కిటికీలో నుంచి గమనించిన భర్త తలుపులు పగలగొటి లోపలికి వెళ్లడంతో అప్పటికే మృతి చెంది ఉంది. వివాహిత మృతికి కారణాలు తెలియాల్సి ఉంది. కాగా ఆమె మృతదేహాన్ని ఆదివారం రాత్రి స్వగ్రామానికి తీసుకువచ్చారు.

తెగబడిన టీడీపీ నేత

- గుట్టు చప్పుడు కాకుండా పాఠశాల ఆవరణలో చెట్ల నరికివేత
- స్థానికుల ఫిర్యాదుతో మధ్యలోనే నిలిపేసిన అధికారులు



పాఠశాల ఆవరణలో కొట్టివేసిన చెట్లు

వల్లూరు : ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటడమే కాక వాటిని సంరక్షించండి. తల్లి పేరుతో ఒక మొక్కను నాటి సంరక్షించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడండి అనే నినాదాలతో అధికారులు, ప్రజా ప్రతినిధులు విరివిగా ప్రచారం నిర్వహిస్తూ వస్తున్నారు. అయితే టీడీపీ నేతలు మాత్రం తమ స్వార్థ ప్రయోజనాల కోసం పెద్ద పెద్ద చెట్లనే నరుకుతూ పర్యావరణ పరిరక్షణకు తూట్లు పొడుస్తున్నారు. ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో కొన్నేళ్ల క్రితం స్థానిక విద్యార్థులు నాటి సంరక్షిస్తూ వస్తున్న పెద్ద పెద్ద చెట్లను కూల్చడానికి ఉపక్రమించగా స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేశారు. వారు జోక్యం చేసుకుని చెట్ల నరికివేతను మధ్యలో నిలిపి వేశారు. వివరాల్లోకి వెళితే.. వల్లూరు మండల పరిధిలోని కొట్లూరు ఎస్సీ కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఆ పాఠశాలలో చదివే విద్యార్థులు కొన్ని సంవత్సరాల క్రితం వేప, బినసపు చెట్లను నాటి సంరక్షిస్తూ వచ్చారు. దీంతో అవి ఏపుగా పెరిగి విద్యార్థులకు నిత్యం నీడను ఇస్తూ పాఠశాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. స్థానిక టీడీపీ నేతకు ఆ చెట్లపై కన్ను పడింది. దట్టంగా పెరిగిన చెట్లను విక్రయించడానికి సిద్ధమయ్యాడు. చెట్ల కొనుగోలుదారులతో భారీ మొత్తంలో నగదుకు చెట్లను ఇచ్చేలా ఒప్పందం కుదుర్చుకున్నాడు. కనీసం పాఠశాల ఉపాధ్యాయునికి సమాచారం ఇవ్వకుండా దసరా సెలవుల్లో తన పని పూర్తి చేయడానికి సిద్ధమయ్యాడు. విజయ దశమి పండుగ రోజు చెట్లు కొనుగోలు చేసిన వారు చెట్లను నరికి వేయడం ప్రారంభించారు. అన్ని రోజులు తాము పోషించిన చెట్లను తాము చూస్తుండగానే కూల్చడం చూసిన స్థానికులు దాన్ని జీర్ణించుకోలేక బాధతో అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో తహసీల్దార్ ఆదేశాల మేరకు రెవెన్యూ సిబ్బంది మధ్యాహ్నం పాఠశాల వద్దకు చేరుకుని చెట్ల నరికివేతను నిలిపి వేశారు. అప్పటికే చాలా వరకు చెట్లను నరికి వేశారు. ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండా చెట్లను నరికి వేయడంతో వాటి కొమ్మలు గత సంవత్సరం నాడు-నేడు నిధులతో అభివృద్ధి చేసిన పాఠశాల భవనాలపై పడ్డాయి. దీంతో అవి కూడా పాక్షికంగా దెబ్బతిన్నాయేమోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. దసరా సెలవులు ముగిసిన నేపథ్యంలో సోమవారం పాఠశాల తెరవాల్సి ఉండగా విద్యార్థులు పాఠశాలలోకి వెళ్లేందుకు దారి కూడా లేకుండా పోయింది.

ఎలాంటి అనుమతులు లేకుండానే..

సాధారణంగా ఎవరైనా తమ సొంత భూమిలో ఉన్న చెట్టును తప్పనిసరి పరిస్థితుల్లో కొట్టుకోవాలన్నా రెవెన్యూ అధికారుల నుంచి అనుమతులు తప్పనిసరిగా పొందాల్సి ఉంటుంది. అలాంటిది ప్రభుత్వ పాఠశాల ఆవరణలో వున్న చెట్లను ఎలాంటి అనుమతులు లేకుండా కనీసం ఆ పాఠశాల ఉపాధ్యాయునికి కూడా తెలియకుండా కొట్టివేసేందుకు ఉపక్రమించడం.. అధికార పార్టీకి చెందిన తమను ఏ ఒక్కరూ ఏమీ అనరనే భావనే కారణమని స్థానికులు చర్చించుకుంటున్నారు. అధికారులు దీనిపై విచారణ నిర్వహించి చెట్లను నరికిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మహిళ మెడలోని గొలుసు లాక్కెళ్లిన దుండగులు

మైదుకూరు : దసరా ఉత్సవాలను చూసేందుకు వచ్చిన ఓ మహిళ మెడలోని బంగారు గొలుసును దుండగులు లాక్కెళ్లిన సంఘటన మైదుకూరులో శనివారం సాయంత్రం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని లింగాలదిన్నెకు చెందిన భూమిరెడ్డి వెంకటరాధ అనే మహిళ శనివారం సాయంత్రం మైదుకూరులో దసరా ఉత్సవాలను తిలకించేందుకు వచ్చింది. అమ్మవారి దర్శనం చేసుకుని స్థానిక నంద్యాల రోడ్డులో నిలుచుని ఉండగా మోటార్ బైక్‌పై వచ్చిన ఇద్దరు అగంతకులు ఆమె మెడలోని బంగారు గొలుసును లాక్కెళ్లారు. మహిళ లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించి సంఘటనపై ఫిర్యాదు చేసింది. తన మెడలో ఉన్న 40 గ్రాముల బంగారు గొలుసును దుండగులు లాక్కెళ్లినట్టు ఆమె ఫిర్యాదులో పేర్కొంది. ఆ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వైవీయూలో 'రాజీ'డ్రామాలు.?

- రిజిస్ట్రార్ పదవికి రాజీనామా అంటూ కొత్త నాటకం
- మరోసారి దళిత పరిశోధక విద్యార్థి అంశం తెరపైకి

సాక్షి టాస్క్‌ఫోర్స్ : యోగివేమన విశ్వవిద్యాలయం ప్రతిష్టను దెబ్బతీసేలా కూటమి ప్రభుత్వం, అధికారులు వ్యవహరిస్తుండటంతో విశ్వవిద్యాలయ ప్రాభవంపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. బోధన, పరిశోధన రంగాల్లో అత్యున్నత ట్రాక్ రికార్డు కలిగిన ఆచార్య చింతా సుధాకర్, ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్యలను వైస్ ఛాన్సలర్, రిజిస్ట్రార్ పదవులకు టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రాజీనామాలు చేయించి లైంగిక ఆరోపణలు కలిగిన ఆచార్య కె. కృష్ణారెడ్డిని వీసీగా నియమించింది. ఈయన నియామకంపై విద్యార్థి సంఘాలు పెద్ద ఎత్తున నెలల తరబడి ఆందోళనలు, నిరసనలు చేపట్టాయి. ఇది ఓ వైపు కొనసాగుతుండగానే.. స్థానిక ప్రజాప్రతినిధుల ఒత్తిడితో మరో లైంగిక ఆరోపణలు ఎదుర్కొన్న ఆచార్య టి. రామప్రసాద్‌రెడ్డిని రిజిస్ట్రార్‌గా నియమించారు. దీంతో మళ్లీ నిరసనలు, ఆందోళనలు ప్రారంభమయ్యాయి. ఎంతో ప్రతిష్టాత్మక విశ్వవిద్యాలయంగా వినుతికెక్కిన విశ్వవిద్యాలయం ప్రతిష్ట గత మూడు నెలలుగా ఆరోపణలు, ఆందోళనలతో మసకబారుతోంది.

'రాజీ'డ్రామాకు తెర..

రిజిస్ట్రార్‌గా నియమితులైన ఆచార్య టి.రామప్రసాద్‌రెడ్డిపై మీడియాలో కథనాలు రావడంతో ప్రభుత్వం ఆయనకు పూర్తి స్థాయిలో అధికారం అప్పజెప్పవద్దంటూ వీసీని ఆదేశించినట్లు సమాచారం. దీంతో ఆయన పదవి అలంకార ప్రాయంగా మారింది. ఈ కారణంగా ఆయన రిజిస్ట్రార్ కుర్చీలో కూడా కూర్చోవడం లేదన్నది విశ్వవిద్యాలయ వర్గాల సమాచారం. ఎలాంటి చెక్ పవర్ లేకుండా, నిర్ణయాలు తీసుకునే అధికారం లేకపోవడంతో కినుక వహించిన ఆయన రిజిస్ట్రార్ పదవికి రాజీనామా డ్రామాను తెరపైకి తెచ్చినట్లు తెలిసింది. రాజీనామా చేసినప్పటికీ ఆమోదించకుండా ఉండేలా స్థానిక ప్రజాప్రతినిధి నుంచి ఒత్తిడి తీసుకువచ్చే వ్యూహానికి తెరలేపినట్లు సమాచారం. కాగా విశ్వవిద్యాలయం అధికారులపై గత మూడు నెలలుగా వస్తున్న ఆరోపణలపై జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో అధికార యంత్రాంగం నివేదిక రూపొందించి ప్రభుత్వానికి పంపినట్లు సమాచారం. కాగా ఆచార్య టి. రామప్రసాద్ రెడ్డి వద్ద పరిశోధన చేసిన డాక్టర్ తవ్వా వెంకటయ్య పరిశోధన సమయంలో తనను ఇబ్బంది పెట్టిన, అవమానించిన అంశాలను సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేస్తూ పాత అంశాలను మరోసారి తెరమీదకు తీసుకురావడంతో విశ్వవిద్యాలయం మరోసారి కుట్ర రాజకీయాలకు కేంద్రంగా నిలవనుంది. కాగా వైస్ ఛాన్సలర్, రిజిస్ట్రార్ పదవులను పొందాలనుకుంటున్న ఆచార్యుల సంఖ్య విశ్వ విద్యాలయంలో ఎక్కువగా ఉండటంతో ప్రత్యర్థుల బలహీనతలు, ఆరోపణలను తెరపైకి తెస్తూ తమ అవకాశాలను మెరుగుపరుచుకునే క్రమంలో విశ్వవిద్యాలయ ప్రతిష్టకు భంగం కలిగిస్తున్నారనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఇటీవల విశ్వవిద్యాలయంలో ప్రవేశాల సంఖ్య దారుణంగా పడిపోవడం కూడా ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. విశ్వవిద్యాలయ ప్రతిష్టను దెబ్బతీసే చర్యలు మానుకోవాలని పలువురు కోరుతున్నారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

చిట్వేలి : మండల పరిధిలోని వెంకటరాజుపల్లి అరుంధతివాడకు చెందిన కొత్తూరు నరసింహులు(54) శుక్రవారం ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

సచివాలయ ఉద్యోగిపై హత్యాయత్నం

వేముల : మండలంలోని చాగలేరు గ్రామ సచివాలయ ఉద్యోగి బాబా ఫక్రుద్దీన్‌పై శనివారం రాత్రి హత్యాయత్నం జరిగింది. వివరాలు ఇలా.. వేంపల్లి మండలం తాళ్లపల్లి గ్రామానికి చెందిన బాబా ఫక్రుద్దీన్ వేముల మండలం వేల్పుల సచివాలయంలో జూనియర్ అసిస్టెంట్ లైన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ నేపథ్యంలో గత కొంతకాలంగా అదే గ్రామానికి చెందిన యువతితో సన్నిహితంగా ఉండేవాడు . ఇది గమనించిన యువతి స్నేహితుడు వినోద్ జీర్ణించుకోలేకపోయాడు. దీంతో బాబా ఫక్రుద్దీన్‌ను హత్య చేసేందుకు యువతితో కలిసి పథకం పన్నాడు. వేముల మండలంలోని చాగలేరు గ్రామ సమీపంలోని నిర్మానుష్య ప్రదేశానికి రమ్మని ఆ యువతి మెసేజ్ పంపింది. బాబా ఫక్రుద్దీన్ ఆ ప్రదేశానికి రాగానే అప్పటికే అక్కడ సిద్ధంగా యువతి స్నేహితుడు వినోద్ కత్తితో దాడి చేశాడు. ఈ దాడి నుంచి తప్పించుకొని బాబా ఫక్రుద్దీన్ పొలాల్లోకి పరిగెత్తుకు వెళ్లాడు.

కొద్ది దూరం వెళ్లిన తర్వాత తనపై దాడి జరిగిన విషయాన్ని బంధువులకు సమాచారం ఇచ్చాడు. దీంతో వారు అక్కడికి చేరుకొని వెంటనే కడపలోని ఓ ప్రైవేటు ఆసుపత్రి తరలించారు. ఈ సంఘటనకు సంబంధించి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రాణించిన కడప బ్యాట్స్‌మన్

కడప స్పోర్ట్స్ : కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అంతర్ జిల్లాల అండర్-14 మల్టీడేస్ క్రికెట్ పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. టోర్నీలో భాగంగా కేఎస్ఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో ఆదివారం కడప, కర్నూలు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన కర్నూలు జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు 90 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 346 పరుగులు చేసింది. జట్టులోని తాహీర్ 66 పరుగులు చేయగా, సాయికృష్ణ చైతన్య 134 పరుగులతో క్రీజులో నిలిచాడు. కర్నూలు బౌలర్లు వివేక్ 3, హరిహరణ్ 2 వికెట్లు తీశారు. దీంతో తొలిరోజు ఆట ముగిసింది.

రాజారెడ్డి స్టేడియంలో..

వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో ప్రకాశం, పశ్చిమగోదావరి జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన పశ్చిమగోదావరి జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. 90 ఓవర్లలో పశ్చిమగోదావరి జట్టు 7 వికెట్ల నష్టానికి 224 పరుగులు చేసి డిక్లేర్ చేసింది. జట్టులోని పి. నారాయణ 71 పరుగులు, జితేష్‌సాయిరెడ్డి 74 పరుగులు చేశారు. ప్రకాశం బౌలర్లు లోకేష్ 3, లతీఫ్ 2 వికెట్లు తీశారు.



తలపడుతున్న ప్రకాశం, పశ్చిమగోదావరి జట్టు

అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ప్రకాశం జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 8 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 24 పరుగులు చేసింది. జట్టులోని చరణ్ 12 పరుగులతో క్రీజులో ఉన్నాడు. దీంతో తొలిరోజు ఆట ముగిసే సమయానికి ప్రకాశం జట్టు 200 పరుగుల తేడాతో వెనుకంజలో ఉంది.

కేఓఆర్ఎం మైదానంలో..

కేఓఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో చిత్తూరు, తూర్పుగోదావరి జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన తూర్పుగోదావరి జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. 63.5 ఓవర్లలో 205 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని కార్తీక్ 44, రాజ్ ఆర్యన్ 39 పరుగులు చేశారు. చిత్తూరు బౌలర్లు తేజేష్ 4, దినేష్ 2, ఆశిష్‌రెడ్డి 2 వికెట్లు చొప్పున తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 37 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 118 పరుగులు చేసింది. జట్టులోని సాయిచరణ్ 40 పరుగులు చేశాడు. తూర్పుగోదావరి బౌలర్లు కార్తీక్ 2, తమన్ 2, శేఖర్ 2 వికెట్లు తీశారు. దీంతో తొలిరోజు ఆట ముగిసే సమయానికి 87 పరుగుల తేడాతో చిత్తూరు జట్టు వెనుకంజలో ఉంది.



134 పరుగులు చేసిన కడప బ్యాట్స్‌మన్ సాయికృష్ణ చైతన్య



4 వికెట్లు తీసిన చిత్తూరు బౌలర్ తేజేష్